మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 239 | బుధవారం | 11 - 03 - 2026 | పేజీలు: 8 | వెల: 4

## పేదల పెన్నిధి... గుమ్మనూరు నారాయణ



3లో..




### మినిమం బ్యాలెన్స్ పేరుతో రూ.19 వేల

# కోట్లు వసూలు


- మూడేళ్లలో ప్రైవేట్ బ్యాంకులు రూ.11 వేల కోట్లు వసూలు
- ప్రభుత్వరంగ బ్యాంకులు రూ.8 వేల కోట్లు వసూలు
- పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి వెల్లడింపు

మన గళం, న్యూఢిల్లీ : బ్యాంకు ఖాతాల్లో కనీస నిల్వలు లేకపోవడం కారణంగా గత మూడేళ్లలో ప్రైవేట్ మరియు ప్రభుత్వరంగ బ్యాంకులు భారీగా ఛార్జీలు వసూలు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ కాలంలో ప్రైవేట్ రంగ బ్యాంకులు ఖాతాదారుల నుంచి సుమారు

2 లో..

# దేశవ్యాప్తంగా వంటగ్యాస్ కొరత

# కలకలం



- ☐ ముంబైలో 20 శాతం హోటళ్లు మూత
- ☐ పలు నగరాల్లో వాణిజ్య సిలిండర్ల కొరత
- ☐ బ్లాక్ విక్రయాలపై కేంద్రం కట్టడి చర్యలు

మన గళం డెస్క్ : దేశంలో చమురు, వంటగ్యాస్ నిల్వలు సరిపడా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ పలు ప్రాంతాల్లో వాణిజ్య సిలిండర్ల కొరత తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా ముంబై నగరంలో వంటగ్యాస్ అందుబాటులో లేకపోవడంతో హోటళ్లు, రెస్టారెంట్లు కార్యకలాపాలు



నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముంబై హోటల్ అండ్ రెస్టారెంట్ సంఘం తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని సుమారు 20 శాతం హోటళ్లు ఇప్పటికే మూతపడ్డాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే రెండు రోజుల్లో నగరంలోని సగం హోటళ్లు మూతపడే ప్రమాదం ఉందని సంఘం హెచ్చరించింది. ముంబై మాత్రమే కాకుండా ఢిల్లీ, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్లో కూడా వాణిజ్య సిలిండర్ల కొరత కనిపిస్తోంది. కొన్ని హోటళ్లలో వంటగ్యాస్ అందుబాటులో లేకపోవడంతో తాత్కాలికంగా సేవలను నిలిపివేస్తున్నారు. సిలిండర్ల కొరత కారణంగా తమ వ్యాపారం తీవ్రంగా దెబ్బతింటోందని హోటల్ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా కొంతమంది మధ్యవర్తులు ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని బ్లాక్ విక్రయాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఒక్కో వాణిజ్య సిలిండర్‌ను రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారనే వార్తలు వెలువడుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కట్టడి చర్యలు చేపట్టింది. ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని ప్రస్తుతం ఉన్న 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచడంతో పాటు వాణిజ్య సిలిండర్ల సరఫరా పరిస్థితిని సమీక్షించేందుకు చమురు మంత్రిత్వ శాఖ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది.

దేశంలో ప్రతి ఏడాది సుమారు 31.3 మిలియన్ టన్నుల వంటగ్యాస్ వినియోగం జరుగుతోంది. ఇందులో దాదాపు 62 శాతం గ్యాస్ దిగుమతుల ద్వారానే వస్తోంది.

2 లో..

## జల్ జీవన్ మిషన్‌పై

# కేబినెట్ కీలక నిర్ణయం

- గ్రామీణ గృహాలకు స్థిరమైన తాగునీటి సరఫరా లక్ష్యం
- మౌలిక వసతుల నుంచి సేవల అందింపుపై దృష్టి
- గ్రామీణ మహిళల సాధికారతకు తోడ్పాటు



మన గళం, న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా గ్రామీణ గృహాలకు స్థిరమైన తాగునీటి సరఫరా అందించేందుకు కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేస్తూ తీసుకున్న ఈ నిర్ణయం గ్రామీణ ప్రజలకు పెద్ద ఉపశమనం కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు మౌలిక వసతుల సృష్టిపైనే దృష్టి పెట్టిన ఈ పథకం ఇకపై ప్రజాకేంద్రిత సేవల అందింపుపై దృష్టి సారించనుందని ప్రధానమంత్రి చెప్పారు. స్థానిక పాలన వ్యవస్థల భాగస్వామ్యంతో పాటు డిజిటల్ పర్యవేక్షణ

2 లో..

## ఏపీని స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్‌గా

# తీర్చిదిద్దే లక్ష్యం

- ☐ బీచ్ సాండ్ ఖనిజాల వినియోగంపై సీఎం దృష్టి
- ☐ పదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడుల లక్ష్యం
- ☐ మూడు ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదనలు



మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌ను 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా నిర్దేశించారు. రాష్ట్ర తీరప్రాంతంలో లభించే విలువైన బీచ్ సాండ్ ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ఖనిజాలను ఆధారంగా చేసుకుని పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ఊపునివ్వాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో

2 లో..

## అలిపిరి తనిఖీలో రూ.60 లక్షల నగదు పట్టివేత



- తిరుమల వెళ్లే కారులో భారీ నగదు స్వాధీనం
- ఆధారాలు చూపలేకపోయిన వ్యక్తి అదుపులోకి
- నగదు మూలాలపై పోలీసుల దర్యాప్తు

తిరుపతి, 10 మార్చి ,మన గళం: తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తుల రద్దీ కొనసాగుతున్న సమయంలో అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద భారీ మొత్తంలో నగదు పట్టుబడటం కలకలం రేపింది. టీటీడీ విజిలెన్స్ సిబ్బంది నిర్వహించిన సాధారణ

2 లో..

## అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబోం : సీఈసీ

- ☐ పశ్చిమబెంగాల్ ఎన్నికలపై ఎన్నికల సంఘం దృష్టి
- ☐ స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహిస్తాం
- ☐ అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు



మన గళం, అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరుని కూడా ఓటర్ జాబితా నుంచి తొలగించబోమని కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పశ్చిమబెంగాల్‌లో పర్యటించిన ఎన్నికల సంఘం బృందం రాజకీయ పార్టీలు, అధికారులతో సమావేశాలు నిర్వహించింది. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన ఎన్నికల నిర్వహణపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమబెంగాల్‌లో స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడటం ఎన్నికల సంఘం మొదటి ప్రాధాన్యమని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించబోమని ఆయన స్పష్టం చేశారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారమే అన్ని రాష్ట్రాల్లో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అమలవుతుందని తెలిపారు. ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడటం, అర్హులైన వారి పేర్లు నమోదు అయ్యేలా చూడటమే ఈ ప్రక్రియ లక్ష్యమని చెప్పారు. ఎన్నికలు ఎన్ని దశల్లో నిర్వహించాలన్నది రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే శాంతిభద్రతల ఏర్పాట్లపై ఆధారపడి ఉంటుందని

2 లో..

## నెల్లిమర్లలో రహదారుల అభివృద్ధి పనులకు శ్రీకారం

- మూడు మండలాల్లో ఆర్ అండ్ బి రోడ్ల రిసర్ఫేసింగ్ ప్రారంభం
- ప్రయాణ సౌలభ్యం, ప్రజా భద్రత పెంపు లక్ష్యం
- నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచన



2 లో..

## మినిమం బ్యాలెన్స్ పేరుతో
# రూ.19 వేల కోట్లు వసూలు




రూ.11 వేల కోట్లు వసూలు చేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటుకు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఇదే సమయంలో ప్రభుత్వరంగ బ్యాంకులు కూడా రూ.8 వేల కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అత్యధికంగా రూ.3,800 కోట్లు కనీస నిల్వల నిబంధన పేరుతో ఖాతాదారుల నుంచి వసూలు చేసినట్లు మంత్రి వివరించారు. ఆ తర్వాత యాక్సిస్ బ్యాంకు రూ.2,700 కోట్లు, ఐసీఐసీఐ బ్యాంకు రూ.1,200 కోట్ల చొప్పున వసూలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ వివరాలు బ్యాంకింగ్ రంగంలో చర్చకు దారితీశాయి.

ప్రభుత్వరంగ బ్యాంకుల్లో పంజాబ్ నేషనల్ బ్యాంకు అత్యధికంగా రూ.1,500 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.1,200 కోట్లు, ఇండియన్ బ్యాంకు రూ.1,100 కోట్ల చొప్పున కనీస నిల్వల ఛార్జీల రూపంలో వసూలు చేశాయని వెల్లడించారు. బ్యాంకుల విధానాలపై ఖాతాదారుల్లో చర్చలు కొనసాగుతున్నాయి.ఇక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాత్రం 2020 మార్చి నుంచి కనీస నిల్వలపై ఎలాంటి ఛార్జీలు వసూలు చేయడం లేదని మంత్రి తెలిపారు. గత ఏడాది నుంచి పంజాబ్ నేషనల్ బ్యాంకు, కెనరా బ్యాంకు కూడా ఈ ఛార్జీలను తొలగించినట్లు వెల్లడించారు. బ్యాంకింగ్ రంగంలో వినియోగదారులకు అనుకూల మార్పులు తీసుకురావాలని పలువురు నిపుణులు సూచిస్తున్నారు.

## జల్ జీవన్ మిషన్‌పై
# కేబినెట్ కీలక నిర్ణయం

ద్వారా తాగునీటి సరఫరా వ్యవస్థను మరింత సమర్థంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయం దేశంలో నీటి భద్రతను బలోపేతం చేయడమే కాకుండా ప్రజల ఆరోగ్య పరిస్థితులను కూడా మెరుగుపరుస్తుందని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రమైన తాగునీరు అందడం వల్ల ఆరోగ్య సమస్యలు తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ మహిళల సాధికారతకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని మోదీ తెలిపారు. ఇంటి వద్దే తాగునీటి సౌకర్యం కల్పించడం ద్వారా మహిళల శ్రమ తగ్గి వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## అర్హులైన ఓటర్ల పేర్లు
# తొలగించబోం : సీఈసీ

పేర్కొన్నారు. పశ్చిమబెంగాల్‌లో సుమారు 80 వేల పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అందులో దాదాపు 61 వేల కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత పెంచేందుకు అన్ని పోలింగ్ బూత్‌లలో వెబ్‌కాస్టింగ్ అమలు చేయనున్నట్లు చెప్పారు. ఓటర్లను లేదా ఎన్నికల అధికారులను ఎవరైనా బెదిరించే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం హెచ్చరించింది.

# దేశవ్యాప్తంగా వంటగ్యాస్ కొరత కలకలం

ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా హోర్ముజ్ జలసంధి మార్గంలో రవాణా అంతరాయం ఏర్పడటంతో దిగుమతులపై ప్రభావం పడింది. అయితే దేశంలో ప్రస్తుతం సరిపడా గ్యాస్ నిల్వలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.



# ఏపీని స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యం



గనుల శాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ విషయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా 'ఆంధ్రప్రదేశ్ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్' ఏర్పాటు చేసి పెట్టుబడులను ఆకర్షించాలన్న అంశంపై అధికారులు, సీఎం మధ్య విస్తృత చర్చ జరిగింది. ఈ మిషన్ ద్వారా రాబోయే పదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు దాదాపు 40 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని సీఎం సూచించారు. కేవలం ఖనిజాలను వెలికితీయడమే కాకుండా వాటికి విలువ జోడించే పరిశ్రమల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశించారు. రేర్ మినరల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేసి రాష్ట్రానికి అనుకూలమైన విధానాలు రూపొందించాలని సీఎం సూచించారు. భవిష్యత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలను సిద్ధం చేయాలని తెలిపారు. రాష్ట్రంలోని వనరులపై పూర్తి అవగాహనతో ముందుకు సాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా అధికారులు రాష్ట్ర తీరప్రాంతంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్ దేశంలోనే అత్యంత విలువైనవని వివరించారు. ఇల్మెనైట్, రుటైల్, జిర్కాన్, మోనాజైట్, గార్నెట్, సిల్లిమనైట్ వంటి ఖనిజాలు ఇక్కడ లభిస్తున్నాయని తెలిపారు. వీటిని ఆధారంగా చేసుకుని పెయింట్స్, కాస్మెటిక్స్, ఔషధాలు, ఏరోస్పేస్, రక్షణ, శస్త్రచికిత్స పరికరాలు, ఎలక్ట్రానిక్స్, అణు ఇంధనం వంటి కీలక పరిశ్రమలకు అవసరమైన ఉత్పత్తులు తయారు చేయవచ్చని వివరించారు. ఈ ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకునేందుకు మూడు ప్రాసెసింగ్ పార్కులను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. శ్రీకాకుళంలో టైటానియం పార్క్, అనకాపల్లిలో రేర్ ఎర్త్ కారిడార్, మచిలీపట్నంలో సమగ్ర టైటానియం మరియు రేర్ ఎర్త్ కారిడార్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, గనులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అలిపిరి తనిఖీలో రూ.60 లక్షల నగదు పట్టివేత

తనిఖీల్లో ఒక కారులో అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.60 లక్షల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఉదయం ఒక వ్యక్తి తన కారులో తిరుమల కొండపైకి వెళుతుండగా అలిపిరి వద్ద విజిలెన్స్ అధికారులు వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. ఈ తనిఖీలో కారులో దాచిన కరెన్సీ కట్టలు బయటపడ్డాయి. దీంతో వెంటనే అధికారులు ఆ నగదును స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తిని విచారించారు. విజిలెన్స్ సిబ్బంది ప్రశ్నించగా తిరుమలలో నాణేల మార్పిడి కోసం ఈ నగదును తీసుకెళుతున్నట్టు ఆ వ్యక్తి చెప్పినట్లు తెలుస్తోంది. అయితే అంత పెద్ద మొత్తానికి సంబంధించిన ఎలాంటి పత్రాలు లేదా బ్యాంకు ఆధారాలు చూపలేకపోయాడు. దీంతో అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నగదుతో పాటు ఆ వ్యక్తిని అలిపిరి పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు. ఈ నగదు ఎక్కడి నుంచి వచ్చింది, దీని వెనుక అసలు ఉద్దేశం ఏమిటి అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# నెల్లిమర్లలో రహదారుల అభివృద్ధి పనులకు శ్రీకారం

నెల్లిమర్ల, 10 మార్చి ,మన గళం : ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంతో నెల్లిమర్ల నియోజకవర్గంలో పలు రహదారుల పునరుద్ధరణ పనులకు ఎమ్మెల్యే లోకం నాగ మాధవి శ్రీకారం చుట్టారు. మంగళవారం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఆర్ అండ్ బి రోడ్ల రిసర్ఫేసింగ్ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ పనులతో ప్రాంతీయ రహదారుల రూపురేఖలు మారనున్నాయని అధికారులు తెలిపారు. భోగాపురం మండలంలోని ముంజేరు పంచాయతీ పరిధిలో భోగాపురంముక్కాం రహదారి పునరుద్ధరణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ రహదారి తీర ప్రాంత గ్రామాల ప్రజలకు మరియు మత్స్యకారులకు ప్రధాన కేంద్రంతో అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు. అలాగే పూసపాటిరేగ మండలంలోని కుమిలి పంచాయతీ పరిధిలో పోరంజమ్ము రహదారి అభివృద్ధి పనులను ప్రారంభించారు. వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఈ మార్గం కీలకమని తెలిపారు.


నెల్లిమర్ల మండలంలోని చారిత్రక పుణ్యక్షేత్రం రామతీర్థం వద్ద రణస్థలంనెల్లిమర్ల రహదారి రిసర్ఫేసింగ్ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఈ మార్గంలో యాత్రికుల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో రహదారి అభివృద్ధి వల్ల ప్రయాణం సులభతరం అవుతుందని అధికారులు తెలిపారు. పాత రహదారులపై గుంతలను పూడ్చి కొత్త బిటుమినస్ పొర వేయడం ద్వారా రహదారుల ఆయుష్షు ఐదు నుంచి ఏడు సంవత్సరాల వరకు పెరుగుతుందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా నియోజకవర్గంలో రహదారులు అధ్వాన్నంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులను ప్రారంభించామని పేర్కొన్నారు. పనుల్లో ఎక్కడా నాణ్యత విషయంలో రాజీ పడకూడదని, కాంట్రాక్టర్లు నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి శాఖ ఉన్నతాధికారులు, ఇంజనీర్లు, కూటమి పార్టీల నాయకులు, జనసేన, తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





# యనమదలలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యటన

చేజర్ల, 10 మార్చి ,మన గళం : చేజర్ల మండలంలోని యనమదల గ్రామంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులకు ప్రభుత్వ రాజముద్రతో నూతన పట్టాదారు పాసుపుస్తకాలను మంత్రి పంపిణీ చేశారు. రైతులకు భూమి హక్కులను స్పష్టంగా తెలియజేసే ఈ పాసుపుస్తకాలు ఎంతో ఉపయోగకరమని మంత్రి తెలిపారు. ప్రభుత్వ పథకాలు మరియు భూమికి సంబంధించిన వివరాలు రైతులకు సులభంగా అందుబాటులో ఉండేలా ఈ చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.




అలాగే గ్రామపంచాయతీ పరిధిలో రూ.18 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంటు రోడ్డుకు మంత్రి ప్రారంభోత్సవం చేశారు. ఈ రహదారి నిర్మాణంతో గ్రామ ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారనున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదని మంత్రి పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## పేదల పెన్నది... గుమ్మనూరు నారాయణ

**– పేదింటి ఆడపడుచు పెళ్ళికి, పట్టువస్త్రాలు, 10వేల సాయం.**



(ఆలూరు మనగళం): చిప్పగిరి మండలం, గుమ్మనూరు గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన హెచ్ లలెప్ప కుమార్తె వివాహానికి, ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, మరియు బీజేపీ నాయకురాలు గుమ్మనూరు కమలమ్మ దంపతులు, పేదింటి ఆడపడుచు పెళ్ళికి, పట్టువస్త్రాలు, 10వేల రూపాయలు మరియు పెళ్ళికి సరఫడా బియ్యం లలెప్ప దంపతులకు కూతురు పెళ్లికి కానుకగా సాయం అందజేశారు. అనంతరం గుమ్మనూరు నారాయణ మాట్లాడుతూ, నా చేతుల మీదుగా పేదింటి ఆడపడుచులకు కష్టంగా ఉన్న వారికి గతంలో కూడ కానుకగా అందించాను, ఇలాంటి కార్యక్రమాలు నా ద్వారా జరగడం నాకు, మా పిల్లలకు మంచి జరుగుతుంది అని సంతోషం వ్యక్తం చేశారు. సేవ కార్యక్రమాలకు గుమ్మనూరు నారాయణ ఎల్లవేళలా తోడుగా, అండగా ముందుంటాను ఉంటాను అని తెలియజేశారు.

## శ్రీ సుంకుల పరమేశ్వరి దేవి 9వ వార్షికోత్సవ మహోత్సవం





(ఆలూరు మనగళం) : ఆలూరు పట్టణంలోని కోట వీధిలో స్థానికంగా వెలసిన శ్రీ సుంకులమ్మ దేవి 9వ వార్షికోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని ముఖ్య అతిథులుగా ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇంచార్జి వైకుంఠం జ్యోతి, మరియు తనయుడు వైకుంఠం సాయి శ్రీరామ్ (ఎన్ఆర్ఐ) పాల్గొని, శ్రీ సుంకల పరమేశ్వరి అమ్మవారికి అభిషేకం మరియు ప్రత్యేక పూజలు చేసిన వైకుంఠం జ్యోతి మరియు వైకుంఠం సాయి శ్రీరాము మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి కృపాకటాక్షాలతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని వైకుంఠం జ్యోతి ఆకాంక్షించారు.

## రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో హాజరైన ఆలూరు సెంబ్లీబూత్ కమిటీ విభాగం అధ్యక్షులు లోకనాథ్

**– స్థానిక ఎన్నికల్లో గేలేపే ధ్యేయంగా పనిచేయాలి.. సజ్జల రామకృష్ణారెడ్డి.**





(ఆలూరు మనగళం): తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర స్థాయి సమావేశానికి హాజరైన ఆలూరు ఆసెంబ్లీ బూత్ కమిటీ విభాగం అధ్యక్షులు చిప్పగిరి లోకనాథ్ మరియు పంచాయతీ రాజ్ వింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులేసు. రాబోయే రోజుల్లో స్థానిక ఎన్నికలకు, ఎలక్షన్ కమిషన్ చేస్తున్న విధావిధనలను అనసరిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటూ, అక్కడ ఏర్పడే సమస్యలను వైసీపీ పార్టీ మరియు నాయకులు ఎదురుకోవాల్సిన విధానాన్ని వివరించారు. సందర్భంగా మన పార్టీకి సంబందించిన సానుభూతిపర్ల ఓటర్లను తొలగించకుండా చేసుకోవాలి అని సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో బూత్ కమిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్ రెడ్డి పాల్గొనడం జరిగింది.

## దేశవ్యాప్తంగా వాల్మీకులు ఎస్టీ హోదా

**– మా ఆంధ్రలో మాత్రం వాల్మీకులను ఎస్టిలుగా ఎందుకు చెయ్యరు.**
**– ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే విరుపాక్షి.**




(ఆలూరు మనగళం): అనంతపురం జిల్లా, గుంతకల్లు పట్టణంలో వాల్మీకులు చేపట్టిన 36 గంటల దీక్షకు ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే విరుపాక్షి మద్దతు తెలిపారు. దేశవ్యాప్తంగా వాల్మీకులు ఎస్టీ హోదాలో ఉన్నారు, మా ఆంధ్రలో మాత్రం వాల్మీకులను ఎస్టిలుగా ఎందుకు గుర్తించారు అని ప్రశ్నించారు. వాల్మీకి సమాజానికి ఎస్టీ హోదా కల్పించాలని రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆంధ్ర రాష్ట్రంలోనే కొన్ని జిల్లాల్లో మాత్రం ఎస్టీలుగా మరికొన్ని జిల్లాల్లో బీసీలుగా వర్గాకరించడం పై ఆవేదన వ్యక్తం చేశారు. వాల్మీకుల ఎస్టీ సాధన సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాటం కొనసాగించాలని వాల్మీకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి జేఏసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి విశేష అభిషేకం



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (10.03.2026) ఉదయం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఈ విశేషఅభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి.కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది. ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహా గణపతి పూజ జరిపించబడింది.అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలైన పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీళ్ళు మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వివిధ పండ్ల రసాలతో చేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.

## నందీశ్వరస్వామికి విశేషపూజ



మనగళం శ్రీశైలం : లోక కల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (10.03.2026) ఆలయప్రాంగణంలోని నందీశ్వర స్వామికి (శనగల బసవన్న స్వామివారికి) విశేషార్చనలను నిర్వహించనున్నది.ప్రతి మంగళవారం మరియు త్రయోదశి రోజున దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ప్రదోషకాలంలో అనగా సాయంసంధ్యాసమయంలో ఈ విశేషపూజలు నిర్వహించడం జరుగుతోంది.ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతుంది.అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహా గణపతి పూజను జరిపించబడుతుంది.ఆ తరువాత నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహిస్తారు. తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించబడుతుంది.వృషభసూక్తం మొదలైన వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగుతుంది. తరువాత నందీశ్వరస్వామివారికి నూతనవస్త్ర సమర్పణ, విశేషపుష్పార్చనలను చేస్తారు. అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వర స్వామికి సమర్పించడం జరుగుతుంది. చివరగా స్వామికి నివేదన సమర్పించబడుతుంది.

## అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ



మనగళం శ్రీశైలం : చైత్రమాసంలో పౌర్ణమి తరువాత శ్రీ భ్రమరాంబాదేవి అమ్మవారికి కుంభోత్సవం జరపడం సంప్రదాయం. ఈ సంవత్సరం ఏప్రిల్ 7న ఈ కుంభోత్సవం నిర్వహించబడుతుంది. అమ్మవారికి సాత్త్వికబలి నిర్వహించేందుకు ( కొబ్బరికాయలు,గుమ్మడికాయలు, నిమ్మకాయలు, మొదలగునవి సమర్పించడం) ఈ కుంభోత్సవం జరిపించడం ఆనవాయితీ. కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించడం ప్రధాన ఘట్టం.కాగా ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే ప్రతి మంగళవారం మరియు శుక్రవారం రోజులలో అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పించడం జరుగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం అనగా ఈ రోజున (10.03.2026) అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ముందుగా అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు,కుంకుమలతో వాటికి పూజాదికాలు జరిపించడం జరిగింది. తరువాత అమ్మవారికి ఈ కొబ్బరికాయలు సమర్పించబడ్డాయి.

# “రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాలు”




మనగళం శ్రీశైలం : నంద్యాల జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ గారి ఆదేశాలమేరకు “రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాలు” నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంలో నంద్యాల జిల్లాలోని పోలీస్ స్టేషన్ ల పరిధిలో పట్టణ/గ్రామీణ ప్రాంతాలలో ముఖ్యమైన ప్రాంతాలలో, కూడళ్లలో ప్రజలతో పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల పై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. నంద్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ చాంద్ బాష గారు శ్రీశైలం శ్రీ బ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దర్శనం నిమిత్తం మోటార్ సైకల్ పై వచ్చే భక్తులు రోడ్డు ప్రమాదలను నివారించేందుకు తప్పనిసరిగా హెల్మెట్ దరించాలని ,వేగం తగ్గించి వాహనాన్ని నడపాలని, ముఖ్యంగా ఘాట్ రోడ్డు నందు వున్నా మలుపులు వద్ద ముందు వెళ్లుచున్న వాహనాన్ని ఎట్టి పరిస్థులల్లో ఓవర్ టేక్ చెయ్యరాదని అవగాహన కల్పించడం జరిగింది. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుంది. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సులు వాహనాలకు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని మరియు పరిమితికి మించి ప్రయాణికులను సరుకులను రవాణా చేయరాదు. మోటార్ సైకిల్లు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా , ఓవర్ స్పీడ్ , ఓవర్ లోడ్ తో వాహనాలు వెళ్ళకుండా, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని తదితర రోడ్డు భద్రత ప్రాముఖ్యతల పై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించడం జరిగింది. రోడ్డు ప్రమాదాల నివారణలో పోలీసు అధికారులు సూచించిన నియమ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలు చేరాలని పోలీస్ అధికారులు విజ్ఞప్తి చేశారు.

# జగన్మోహన్ రెడ్డిని కలిసిన ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

**సంఘసంస్కర్త సావిత్రీబాయి పూలే వర్ధంతితో చిత్రపటానికి నివాళులు అర్పించిన వీరుపాక్షి.**



(ఆలూరు మనగళం): తాడేపల్లి వైసీపీ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి. అనంతరం రానున్న స్థానిక ఎన్నికల గెలుపే ధ్యేయంగా పనిచేయాలని జగన్ సూచించారు. రాజకీయ పరిస్థితులు గురించి జగన్ మోహన్ రెడ్డితో ఎమ్మెల్యే వీరుపాక్షి చర్చించినట్లు సమాచారం. అనంతరం వైయస్ఆర్సీపీ కేంద్ర కార్యాలయంలో




సంఘసంస్కర్త శ్రీమతి సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించిన, ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి మరియు ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు వైస్సార్సీపీ సీనియర్ నేతలు.

# ఊరు దేవర మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాము





(ఆలూరు మనగళం): కర్నూలు జిల్లా, హోలగుంద మండలం, కోవెలతోట గ్రామంలో గ్రామస్థుల ప్రత్యేక ఆహ్వానం మేరకు ఊరు దేవర కార్యక్రమంలో పాల్గొని వారి ఆతిధ్యాన్ని స్వీకరించిన గుంతకల్లు శాసన సభ్యులు గుమ్మనూరు జయరాము మరియు సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు కూటమి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ శ్రీ గోరంట్ల లక్ష్మీ మాధవస్వామి వారి తిరునాల

మన గళం కోడుమూరు: కోడుమూరు మండలం గోరంట్ల గ్రామం లోవెలసిన శ్రీ శ్రీ శ్రీ గోరంట్ల మాధవ స్వామి తిరునాళ్ల సందర్భంగా కోడుమూరు నియోజకవర్గం, కూడా మాజీ చైర్మన్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ శ్రీ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు అనంతరం ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, స్వామి ఆశీస్సులతో అందరూ సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాక్షించరు ఈ కార్యక్రమంలో వైయస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ఘనంగా కొగిలితోట శ్రీ మారెమ్మ అవ్వ ఊరి దేవర మహోత్సవం

**– అమ్మవారి ప్రత్యేక పూజలు చేసిన టీడీపీ ఇంచార్జి వైకుంఠం జ్యోతి.**

(ఆలూరు మనగళం): హోళగుంద మండలం, కొగిలితోట గ్రామంలో అత్యంత వైభవంగా జరిగిన ఊరు దేవర కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు వీరేష్ సాదర ఆహ్వానం మేరకు ఆలూరు టీడీపీ ఇంచార్జి వైకుంఠం జ్యోతి, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వైకుంఠం శివ ప్రసాద్ మరియు తనయులు యువ నాయకులు డా, వైకుంఠం సాయి దినేష్ మరియు వైకుంఠం సాయి శ్రీరాము పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వైకుంఠం జ్యోతి మారెమ్మ అవ్వను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో పాల్గొని అందరితో కలిసి విందును స్వీకరించారు.





# సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం





మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (10.03.2026) శ్రీ గిరిజా కూచిపూడి నాట్య అకాడమీ, మండపేట, తూర్పుగోదావరి జిల్లా వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండిఈ నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించబడుతున్నది. ఈ కార్యక్రమములో వినాయకకౌత్వం, జయము జయము శివశంకరా, ఆనందతాండవం, వందేశివం శంకరం, పుష్పాంజలి తదితర గీతాలకు తులసి, భవానీ, శివశ్రీహరిణి, హైమ, చరణి, రూప, శిరీష, మోక్ష, అవంతిక, మధు, తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

# మహిళలపై దాడులను అరికట్టాలి



**– ఏపీ మహిళా సమాఖ్య డిమాండ్**

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు స్థానిక పట్టణంలోని ఇంద్రజిత్తు గుప్త కాలనీలో ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళల దినోత్సవం పురస్కరించుకొని సందర్భంగా కేక్ కట్ చేసి 25 మంది మహిళలకు రైకలు పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఏపీ మహిళా సమాఖ్య జిల్లా నాయకులు సులోచనమ్మ సిపిఐ మండల కార్యదర్శి బి రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు అగత్యాలు పెరిగిపోతున్నాయని పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో కూడా మహిళ్పై అఘాత్యాలు మానభంగాలు నేరాలు ఘోరాలు పెరిగిపోతున్నాయని ప్రేమిస్తామని ప్రేమ పేరుతో మహిళలను రోడ్డుపైనే గొంతులు కోసేస్తున్నారు పెట్రోలు ఆసిడ్ పోసి తగలబెడుతున్నారు అంత జరుగుతున్న కూడా కూటమి ప్రభుత్వ మాత్రం వీటిని అరికట్టడం లేదు తక్షణమే మహిళలకు కొన్ని ప్రత్యేకమైనటువంటి చట్టాలు తీసుకురావాలని వారు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు పర్యాటక కేంద్రాలలో విదేశీ మహిళ యాత్రకులు వస్తే వాళ్లపైన కూడా సామూహికంగా అత్యాచారం చేస్తున్నారు వరకట్న వేధింపులు పెరిగిపోతున్నాయి మహిళలను రెండవ శ్రేణి , పౌరులుగా చూస్తున్నారు పారిశ్రామిక వాడలలో మరియు పంట పొలాలలో రైతులకు మరియు మహిళా రైతులకు ఇచ్చే వేతనం కూడా తక్కువ అయింది మహిళా రైతులకు కూడా సమాన పని సమాన వేతనం కల్పించాలి డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలో లక్ష్మీదేవి కాసింది షబానా మద్దమ్మ సుంకులమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మనిషి విలువను తెలియజేసే కృతజ్ఞత భావం



మన గళం డెస్క్ : మనిషి జీవితంలో ఎన్నో విజయాలు, ఆనందాలు కనిపిస్తాయి. అయితే ఆ విజయాల వెనుక చాలా మంది వ్యక్తుల సహాయం, ప్రోత్సాహం దాగి ఉంటుంది. కుటుంబ సభ్యులు, స్నేహితులు, గురువులు, సహోద్యోగులు ఇలా అనేక మంది మన ప్రయాణంలో భాగస్వాములవుతారు. వారి సహాయం లేకుండా మన జీవిత ప్రయాణం అంత సులభంగా ఉండకపోవచ్చు. అయినప్పటికీ చాలా సందర్భాల్లో వారు చేసిన సహాయాన్ని మనం సహజంగా తీసుకుంటూ కృతజ్ఞత తెలియజేయడం మరిచిపోతుంటాం. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం మార్చి 11న అంతర్జాతీయ కృతజ్ఞత దినాన్ని నిర్వహిస్తూ మనకు సహాయం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు చెప్పాలని ప్రపంచానికి గుర్తు చేస్తున్నారు. కృతజ్ఞత అనేది ఒక చిన్న మాట అయినప్పటికీ దాని వెనుక ఉన్న భావం ఎంతో గొప్పది. ఒక వ్యక్తి మనకు సహాయం చేసినప్పుడు అతనికి కృతజ్ఞత తెలియజేయడం ద్వారా మనం అతని కృషిని గౌరవిస్తున్నామని తెలియజేస్తాం. ఇది కేవలం మాటల పరిమితిలో ఉండే విషయం కాదు. కృతజ్ఞత మన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే ఒక ముఖ్యమైన విలువగా భావించబడుతుంది. ధన్యవాదాలు చెప్పడం ద్వారా మనలో ఉన్న వినయం, గౌరవం, సానుకూల దృక్పథం బయటపడుతుంది. చిన్న ధన్యవాదం కూడా ఒక మనిషి హృదయంలో ఆనందాన్ని కలిగించగలదు.

కుటుంబంలో కృతజ్ఞత భావం మరింత ముఖ్యమైనది. తల్లిదండ్రులు పిల్లల కోసం చేసే త్యాగాలు, గురువులు విద్యార్థులకు అందించే మార్గదర్శనం, స్నేహితులు కష్టకాలంలో అందించే మద్దతు ఇవన్నీ మన జీవితాన్ని మలిచే అంశాలు. ఈ సహాయాన్ని గుర్తించి వారికి కృతజ్ఞత తెలియజేయడం మన బాధ్యతగా భావించాలి. కుటుంబ సభ్యుల మధ్య పరస్పర గౌరవం పెరగడానికి కూడా కృతజ్ఞత భావం ఎంతో సహాయపడుతుంది. ఒక చిన్న ధన్యవాదం కుటుంబ బంధాలను మరింత బలపరచగలదు. ప్రస్తుత కాలంలో జీవన విధానం వేగంగా మారుతోంది. ప్రతి ఒక్కరూ తమ లక్ష్యాల కోసం పరుగులు తీస్తున్నారు. ఈ ప్రయాణంలో కొన్నిసార్లు మన చుట్టూ ఉన్నవారిని, వారు చేస్తున్న సహాయాన్ని మనం గమనించకుండా పోతుంటాం. వ్యక్తిగత విజయాలపై దృష్టి పెట్టే సమయంలో మన విజయాలకు కారణమైన వ్యక్తులను మర్చిపోవడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కృతజ్ఞత దినం మనకు ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తోంది. మన జీవితంలో చిన్న సహాయం చేసిన వ్యక్తినైనా గుర్తు పెట్టుకుని ధన్యవాదాలు చెప్పడం ద్వారా మనం మానవత్వాన్ని నిలబెట్టుకుంటున్నాం అనే భావన ఈ రోజు గుర్తుచేస్తోంది.

కృతజ్ఞత భావం వ్యక్తిగత జీవితానికి మాత్రమే పరిమితం కాదు. ఇది సమాజంలో సానుకూల వాతావరణాన్ని ఏర్పరచడంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ఒకరిపై ఒకరికి గౌరవం పెరగడానికి, పరస్పర విశ్వాసం బలపడడానికి కృతజ్ఞత ఎంతో సహాయపడుతుంది. కార్యాలయాల్లో కూడా సహోద్యోగుల కృషిని గుర్తించి ధన్యవాదాలు చెప్పడం ద్వారా సహకార భావం పెరుగుతుంది. సమాజంలో ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవంతో వ్యవహరిస్తే సమాజం మరింత సమతుల్యంగా మారుతుంది. పిల్లలలో కూడా చిన్నప్పటి నుంచే కృతజ్ఞత భావాన్ని పెంపొందించడం ఎంతో అవసరం. తల్లిదండ్రులు, గురువులు పిల్లలకు ధన్యవాదాలు చెప్పే అలవాటును నేర్పిస్తే వారు మంచి విలువలతో పెరుగుతారు. ఇది వారి వ్యక్తిత్వాన్ని మెరుగుపరచడమే కాకుండా సమాజంలో మంచి పౌరులుగా ఎదగడానికి సహాయపడుతుంది. కృతజ్ఞత అనే విలువ మన సంస్కృతిలో కూడా ముఖ్యమైన స్థానాన్ని పొందింది. మన సంప్రదాయాలు కూడా పరస్పర గౌరవం, ధన్యవాదాల సంస్కృతిని ప్రోత్సహిస్తాయి.

అంతర్జాతీయ కృతజ్ఞత దినం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు ఈ దినం ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేస్తాయి. మనకు సహాయం చేసిన వ్యక్తులకు ఒక చిన్న సందేశం పంపడం, వారికి ధన్యవాదాలు చెప్పడం, వారి కృషిని గుర్తించడం వంటి చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. ఈ విధంగా కృతజ్ఞత భావాన్ని ప్రోత్సహించడం ద్వారా సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. మొత్తంగా చూస్తే కృతజ్ఞత అనేది ఒక చిన్న భావం కాదు, అది మనిషి విలువలను ప్రతిబింబించే గొప్ప గుణం. మనకు సహాయం చేసిన వారిని గుర్తించడం, వారికి ధన్యవాదాలు చెప్పడం ద్వారా మనం మానవత్వాన్ని నిలబెట్టుకుంటాం. అంతర్జాతీయ కృతజ్ఞత దినం మనకు ఈ విలువను మరలా గుర్తు చేస్తూ పరస్పర గౌరవం, సానుకూలతతో కూడిన సమాజ నిర్మాణానికి మార్గం చూపే ఒక ముఖ్యమైన సందర్భంగా నిలుస్తోంది. కృతజ్ఞత భావం వ్యక్తిగత జీవితానికే కాకుండా సమాజానికి కూడా ఎంతో అవసరం. ఒకరిపై ఒకరికి గౌరవం, విశ్వాసం పెరగడానికి ఇది సహాయపడుతుంది. చిన్న చిన్న విషయాల్లో కూడా ధన్యవాదాలు చెప్పే అలవాటు పెరిగితే సమాజంలో సానుకూల వాతావరణం ఏర్పడుతుంది. పిల్లలకు కూడా చిన్నప్పటి నుంచే కృతజ్ఞత భావాన్ని నేర్పించడం ద్వారా మంచి విలువలు పెంపొందించవచ్చు. అంతర్జాతీయ కృతజ్ఞత దినం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు ఈ దినం ప్రాముఖ్యతను వివరించడంతో పాటు కృతజ్ఞత భావాన్ని పెంపొందించే కార్యక్రమాలను చేపడుతున్నాయి. మనకు సహాయం చేసిన వారికి ఒక చిన్న ధన్యవాదం చెప్పడం ద్వారా మనం కూడా సమాజంలో సానుకూల మార్పుకు కారణం కావచ్చు. మొత్తంగా చూస్తే కృతజ్ఞత అనేది మనిషి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే ఒక గొప్ప విలువ. అది సంబంధాలను బలపరచడమే కాకుండా మనసుకు ఆనందాన్ని కూడా ఇస్తుంది. మన జీవితంలో సహాయం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు చెప్పడం ద్వారా మనం ఒక మంచి సంస్కృతిని కొనసాగిస్తున్నట్టే. అంతర్జాతీయ కృతజ్ఞత దినం మనకు ఈ విలువను గుర్తు చేసే ఒక ముఖ్యమైన సందర్భంగా నిలుస్తోంది.

# “కప్పు టీతో క్యాడర్‌లో జోష్ నింపిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్..



మన గళం : యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలో స్థానిక పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి సాదాసీదాగా కూర్చుని టీ తాగుతూ ఆప్యాయంగా ముచ్చటించిన యర్రగొండపాలెం శాసనసభ్యులు మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీ తాటిపర్తి చంద్రశేఖర్ గారు మరోసారి తన ప్రత్యేక నాయకత్వాన్ని చాటుకున్నారు. ప్రజల మధ్యే ఉండే నాయకుడిగా పేరుగాంచిన చంద్రశేఖర్ గారు, అధికార హోదాలో ఉన్నప్పటికీ ఎలాంటి ఆడంబరాలు లేకుండా కార్యకర్తలతో కలిసిమెలిసి గడపడం ఆయన ప్రత్యేకతగా నిలుస్తోంది. నియోజకవర్గ కేంద్రంలో సాధారణ టీ దుకాణంలో కార్యకర్తలతో కలిసి కప్పు టీ తాగుతూ సరదాగా మాట్లాడిన ఈ దృశ్యం అక్కడి వారికి ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఈ సందర్భంగా కార్యకర్తలతో చర్చిస్తూ పార్టీ బలోపేతం, నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై కూడా ఆయన మాట్లాడారు. గ్రామస్థాయి కార్యకర్తలే పార్టీకి బలం అని, వారి కష్టమే పార్టీని బలంగా నిలబెడుతుందని ఆయన తెలిపారు. ప్రతి కార్యకర్త కూడా పార్టీ అభివృద్ధికి కట్టుబడి పని చేయాలని సూచించారు. క్యాడర్‌తో ఎప్పటికప్పుడు కనెక్ట్ అవుతూ వారి అభిప్రాయాలను తెలుసుకోవడం, వారికి ధైర్యం చెప్పడం, అవసరమైనప్పుడు అండగా నిలవడం చంద్రశేఖర్ గారి నాయకత్వంలో కనిపించే ముఖ్య లక్షణాలు అని స్థానిక నాయకులు తెలిపారు. కార్యకర్తలతో ఇలా సాధారణంగా కూర్చుని మాట్లాడటం వల్ల పార్టీకి మరింత ఉత్సాహం వస్తుందని వారు అభిప్రాయపడ్డారు. నాయకుడు అంటే ప్రజలకు, కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి అనే సందేశాన్ని తన చర్యల ద్వారా చూపిస్తూ, తనదైన శైలిలో క్యాడర్‌లో కొత్త ఉత్సాహం నింపుతూ ముందుకు సాగుతున్న నాయకుడు మా శ్రీ తాటిపర్తి చంద్రశేఖర్ అన్న గారు అని కార్యకర్తలు గర్వంగా చెబుతున్నారు. సాదాసీదా టీ మీటింగ్‌గా ప్రారంభమైన ఈ సమావేశం కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపి, పార్టీ పట్ల మరింత కమిట్మెంట్‌తో పనిచేయాలనే నూతన జోష్‌ను కలిగించిందని స్థానిక నాయకులు పేర్కొన్నారు.

# కొగిలతోట ఊరు దేవుర కార్యక్రమంలో చిప్పగిరి వైసీపీ మండల కన్వినర్ జూటూరు మారయ్య


(ఆలూరు మనగళం): ఆలూరు నియోజకవర్గం, హోలగుంద మండలం, కోగిలతోట గ్రామంలో శ్రీ మారెమ్మ అవ్వ గ్రామ దేవర సందర్భంగా జిల్లా వైస్ చైర్మన్ బావ శేషప్ప, సవరప్ప ప్రత్యేక ఆహ్వానం మేరకు హాజరైన చిప్పగిరి వైసీపీ మండల కన్వీనర్ మారయ్య పాల్గొన్నారు. అనంతరం శేషప్ప, సవరప్ప లు చిప్పగిరి వైసీపీ మండల కన్వీనర్ మారయ్య కు శాలువా కప్పి, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.కె గిరి, ఇంగలధల్ మల్లికార్జున, రామకృష్ణ, కేంచప్ప, పెట్రోల్ బంక్ కిషోర్ మరియు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్య రంగంలో మహిళల సేవలకు ప్రత్యేక గౌరవం



### – వైద్య సేవల్లో మహిళల పెరుగుతున్న ప్రాధాన్యం – సమాజ ఆరోగ్య రక్షణలో మహిళా వైద్యుల కీలక పాత్ర

మన గళం డెస్క్ : ఆరోగ్య రంగంలో అంకితభావంతో సేవలందిస్తున్న మహిళా వైద్యుల కృషిని గుర్తిస్తూ ప్రతి సంవత్సరం మార్చి 11న అంతర్జాతీయ మహిళా వైద్యుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో వైద్యుల పాత్ర అత్యంత కీలకమైనది. ఈ నేపథ్యంలో మహిళా వైద్యులు కూడా తమ ప్రతిభ, సేవాభావంతో ఆరోగ్య రంగంలో విశేష సేవలు అందిస్తున్నారు. వైద్య వృత్తి అనేది అత్యంత బాధ్యతాయుతమైనదిగా భావించబడుతుంది. అలాంటి రంగంలో మహిళలు సమర్థంగా సేవలందిస్తూ సమాజ ఆరోగ్య రక్షణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. ఈ దినోత్సవం ద్వారా మహిళా వైద్యుల సేవలను గౌరవించడం మాత్రమే కాకుండా మరింత మంది మహిళలు వైద్య రంగంలో ముందుకు రావాలని ప్రోత్సహించడం లక్ష్యంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా గత కొన్ని దశాబ్దాల్లో వైద్య రంగంలో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరిగింది. ఒకప్పుడు వైద్య విద్యలో మహిళల సంఖ్య తక్కువగా ఉండేది. సామాజిక పరిస్థితులు, అవకాశాల కొరత వంటి కారణాల వల్ల మహిళలు ఈ రంగంలో ముందుకు రావడానికి అనేక అవరోధాలు ఎదుర్కొన్నారు. అయితే కాలక్రమేణా పరిస్థితులు మారాయి. ప్రస్తుతం అనేక దేశాల్లో మహిళలు వైద్య విద్యను అభ్యసించి వివిధ వైద్య విభాగాల్లో తమ ప్రతిభను చాటుతున్నారు. సాధారణ వైద్య సేవలతో పాటు శస్త్రచికిత్స, పరిశోధన, వైద్య బోధన, ప్రజారోగ్య సేవలు వంటి అనేక రంగాల్లో మహిళలు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. భారతదేశంలో కూడా మహిళా వైద్యుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైవేటు వైద్య సంస్థలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు ఇలా అనేక ప్రదేశాల్లో మహిళా వైద్యులు సేవలందిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు మరియు పిల్లల ఆరోగ్య సంరక్షణలో మహిళా వైద్యుల పాత్ర ఎంతో కీలకంగా ఉంటుంది. గర్భిణీ స్త్రీలకు అవసరమైన వైద్య సేవలు అందించడం, ప్రసవ సమయంలో సహాయం చేయడం, చిన్నపిల్లల ఆరోగ్యాన్ని పర్యవేక్షించడం వంటి బాధ్యతలను మహిళా వైద్యులు సమర్థంగా నిర్వహిస్తున్నారు. చాలా సందర్భాల్లో మహిళలు తమ ఆరోగ్య సమస్యలను మహిళా వైద్యులతో పంచుకోవడంలో మరింత సౌకర్యంగా భావిస్తారు. దీంతో మహిళా వైద్యుల సేవలు సమాజానికి మరింత అవసరంగా మారాయి.



మహిళా వైద్యులు కేవలం చికిత్స అందించడమే కాకుండా ప్రజారోగ్యంపై అవగాహన కల్పించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆరోగ్యకరమైన జీవన విధానం, పోషకాహారం, వ్యాధి నివారణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా వైద్య సేవలను అందిస్తూ ఆరోగ్య సేవలను ప్రజలకు చేరువ చేస్తున్నారు. అనేక సందర్భాల్లో కష్టసమయంలో కూడా నిరంతరం సేవలందిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడటంలో మహిళా వైద్యులు అంకితభావంతో పనిచేస్తున్నారు. వైద్య పరిశోధన రంగంలో కూడా మహిళలు తమ ప్రతిభను నిరూపిస్తున్నారు. కొత్త చికిత్సా విధానాల అభివృద్ధి, వ్యాధులపై పరిశోధనలు, ప్రజారోగ్య విధానాల రూపకల్పన వంటి అంశాల్లో మహిళా వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆధునిక వైద్యశాస్త్ర అభివృద్ధిలో మహిళల కృషి ఎంతో ప్రాధాన్యాన్ని సంపాదించింది. ఆరోగ్య రంగంలో మహిళలు అందిస్తున్న సేవలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నాయి.

అంతర్జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. వైద్య రంగంలో మహిళల పాత్రపై సదస్సులు, చర్చలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వారి సేవలను గుర్తిస్తున్నారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న యువతులకు ప్రోత్సాహం కల్పిస్తూ ఈ రంగంలో మరింత మంది మహిళలు ముందుకు రావాలని పిలుపునిస్తున్నారు. మహిళలు వైద్య రంగంలో కీలక స్థానాలను పొందడం ద్వారా ఆరోగ్య వ్యవస్థ మరింత సమర్థవంతంగా మారుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. సమాజ ఆరోగ్యాన్ని కాపాడటంలో మహిళా వైద్యులు చేస్తున్న సేవలు ఎంతో గొప్పవిగా భావించబడుతున్నాయి. కష్టసమయంలో ప్రజలకు అండగా నిలిచి వారి ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యతను మహిళా వైద్యులు సమర్థంగా నిర్వర్తిస్తున్నారు. వారి కృషి వల్ల ఆరోగ్య సేవలు మరింత విస్తరించి ప్రజలకు చేరువ అవుతున్నాయి. మొత్తంగా చూస్తే అంతర్జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం మహిళా వైద్యుల సేవలను గుర్తించి గౌరవించే ఒక ముఖ్యమైన సందర్భంగా నిలుస్తోంది. ఆరోగ్య రంగంలో మహిళలు చేస్తున్న సేవలు సమాజానికి ఎంతో మేలు చేస్తున్నాయి. ఈ దినోత్సవం ద్వారా మహిళా వైద్యుల కృషిని గుర్తించడం మాత్రమే కాకుండా భవిష్యత్తులో కూడా మరింత మంది మహిళలు వైద్య రంగంలో ముందుకు రావాలని ప్రోత్సహించే సందేశం అందుతోంది. మహిళా వైద్యులు వైద్య సేవలతో పాటు పరిశోధన రంగంలో కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. కొత్త చికిత్సా విధానాల అభివృద్ధి, వ్యాధులపై పరిశోధనలు, ప్రజారోగ్య కార్యక్రమాల అమలులో మహిళలు చురుకుగా పాల్గొంటున్నారు. ఆరోగ్య రంగంలో వారు చేస్తున్న కృషి సమాజానికి ఎంతో మేలు చేస్తోంది. కష్టసమయంలో కూడా సేవలను కొనసాగిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో మహిళా వైద్యులు అంకితభావంతో పనిచేస్తున్నారు. అంతర్జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వైద్య రంగంలో మహిళల పాత్రపై చర్చలు, సదస్సులు, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న యువతులను ప్రోత్సహిస్తూ ఈ రంగంలో మరింత మంది మహిళలు ముందుకు రావాలని పిలుపునిస్తున్నారు. మహిళా వైద్యుల సేవలను గుర్తించి గౌరవించడం ద్వారా ఆరోగ్య రంగంలో సమానత్వాన్ని ప్రోత్సహించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. మొత్తంగా చూస్తే అంతర్జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం ఆరోగ్య రంగంలో మహిళలు చేస్తున్న సేవలను గుర్తు చేసే ఒక ముఖ్యమైన రోజు. సమాజ ఆరోగ్యాన్ని కాపాడటంలో మహిళా వైద్యులు పోషిస్తున్న పాత్ర ఎంతో గొప్పది. వారి కృషి వల్ల ఆరోగ్య సేవలు మరింత విస్తరించి ప్రజలకు చేరువ అవుతున్నాయి. ఈ దినోత్సవం మహిళా వైద్యుల సేవలకు గౌరవం తెలియజేస్తూ ఆరోగ్య రంగంలో సమాన అవకాశాలకు మార్గం చూపుతోంది.

# ఒంటరితనం గుండె ఆరోగ్యానికి ప్రమాదం

– ఒత్తిడి, రక్తపోటు పెరగడం వల్ల ప్రమాదం  – కుటుంబం, స్నేహితులతో కలసి ఉండటం ఆరోగ్యానికి మేలు

మన గళం, ఆరోగ్యం : ఒంటరితనం మన ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక ఒంటరితనం గుండె సంబంధిత వ్యాధులకు దారితీస్తుందని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. నలుగురితో కలిసిమెలిసి ఉండే వ్యక్తుల్లో హృదయ సమస్యలు తక్కువగా కనిపిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఒంటరిగా ఉండే వ్యక్తుల్లో ఒత్తిడి పెరగడంతో పాటు రక్తపోటు, ఇన్‌ఫ్లమేషన్, కార్టిసాల్ అనే ఒత్తిడి హార్మోన్ స్థాయిలు అధికమవుతాయి. ఇవి గుండె జబ్బులు వచ్చే అవకాశాలను పెంచుతాయని వైద్యులు పేర్కొంటున్నారు. సామాజిక ఒంటరితనం కారణంగా కొంతమందిలో ధూమపానం అలవాటు పెరగడం, బయట ఆహారం ఎక్కువగా తీసుకోవడం, వేళాపాళా లేని జీవనశైలి కారణంగా ఊబకాయం వంటి సమస్యలు కూడా తలెత్తుతున్నాయని తెలిపారు. అదే సమయంలో కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలసి ఉండే వారికి మంచి జీవనశైలి అలవాట్లు ఏర్పడతాయి. స్నేహితులతో కలిసి వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన ఆహారం గురించి చర్చించుకోవడం, ధూమపానం, మద్యం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండేందుకు పరస్పరం ప్రోత్సహించుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఆనందంగా గడిపినప్పుడు శరీరంలో కార్టిసాల్ హార్మోన్ స్థాయి తగ్గి రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. అదే సమయంలో 'లవ్ హార్మోన్'గా పిలిచే ఆక్సిటోసిన్ విడుదలై రక్తనాళాలు విస్తరించేందుకు సహాయపడుతుంది. ఇది రక్త ప్రసరణను మెరుగుపరచడంతో పాటు రోగనిరోధక శక్తిని కూడా బలోపేతం చేస్తుంది. జీవితంలో కష్టసమయాల్లో అండగా నిలిచే కుటుంబం, స్నేహితులు ఉంటే మానసిక ధైర్యం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. సామాజిక మద్దతు ఉన్నవారిలో హృదయ స్పందన త్వరగా సాధారణ స్థితికి వస్తుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అందుకే ఒంటరితనాన్ని దూరం చేసుకొని కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఆనందంగా జీవించడం గుండె ఆరోగ్యాన్ని కాపాడటానికి ఎంతో అవసరమని వైద్యులు సూచిస్తున్నారు.

## పిస్తా పప్పు తింటే గుండె
# ఆరోగ్యం మెరుగుదల




– ప్రోటీన్, మెగ్నీషియం సమృద్ధిగా ఉన్న పిస్తా  – బరువు తగ్గించడంలో కూడా సహాయపడే గింజలు


మన గళం, ఆరోగ్యం : పిస్తా పప్పు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే గింజలలో ఒకటిగా వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. మొక్కల ఆధారిత ప్రోటీన్‌కు ఇది మంచి మూలంగా పనిచేస్తుంది. సుమారు 28 గ్రాముల పిస్తా పప్పులో దాదాపు 6 గ్రాముల ప్రోటీన్ లభిస్తుంది. ముఖ్యంగా శాకాహారులకు ఇది మంచి ప్రోటీన్ ఆహారంగా భావిస్తారు. పిస్తాలో శరీరానికి అవసరమైన తొమ్మిది రకాల అమినో ఆమ్లాలు ఉండటంతో పాటు మెగ్నీషియం కూడా మంచి పరిమాణంలో ఉంటుంది. ఇది గుండె స్పందనను నియంత్రించడంలో, కండరాలకు విశ్రాంతి కల్పించడంలో, నరాల పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. నిద్రించే ముందు కొద్దిపాటి పిస్తా తీసుకుంటే మంచి నిద్రకు కూడా సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. పిస్తాను "స్కిన్నీ నట్" అని కూడా పిలుస్తారు. ఇతర గింజలతో పోలిస్తే వీటిలో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. వాల్‌నట్స్, మకాడామియా వంటి గింజలతో పోలిస్తే అదే క్యాలరీలతో ఎక్కువ పిస్తా పప్పు తీసుకోవచ్చు. పిస్తాలో ఉండే ఫైబర్ ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉంచి బరువు తగ్గడంలో సహాయపడుతుంది. అలాగే రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడంలో కూడా ఇవి ఉపయోగపడతాయి.

పిస్తాలో ల్యూటిన్, జియాక్సాంతిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఉండటం వల్ల వయస్సుతో వచ్చే కంటి సమస్యలను తగ్గించడంలో దోహదపడతాయి. హిమోగ్లోబిన్ ఉత్పత్తిని పెంచి రక్తహీనతను తగ్గించడంలో కూడా ఇవి సహాయపడతాయి. జింక్, విటమిన్ ఇ వంటి పోషకాలు ఉండటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. చర్మాన్ని ముడతలు పడకుండా కాపాడటంలో కూడా పిస్తా ఉపయోగకరంగా ఉంటుంది. అయితే పిస్తా పప్పును మితంగా తీసుకోవడం చాలా ముఖ్యం. రోజుకు సుమారు 10 నుంచి 12 పప్పుల వరకు మాత్రమే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎక్కువగా తింటే బరువు పెరగడం, అజీర్ణం వంటి సమస్యలు వచ్చే అవకాశముంది. ఉప్పు కలిపిన పిస్తా పప్పులకంటే ఉప్పు లేని పిస్తాను తీసుకోవడం మంచిదని, ముఖ్యంగా రక్తపోటు ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

# ఒత్తిడిని తగ్గించే సులభమైన యోగా వ్యాయామం

మన గళం, ఆరోగ్యం : ఆధునిక జీవనశైలిలో చాలా మంది ఒత్తిడి, అలసట, మానసిక ఆందోళన వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఈ ఒత్తిడిని తగ్గించడానికి సులభమైన యోగా వ్యాయామాన్ని నిపుణులు సూచిస్తున్నారు. ఈ విధానాన్ని యోగా గురువు సుహాసిని సోషల్ మాధ్యమం ద్వారా వివరించారు. చాలా సులభంగా చేయగల ఈ వ్యాయామం రోజుకు కొన్ని నిమిషాలు చేస్తే శరీరం, మనస్సుకు ఎంతో ఉపశమనం కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యాయామాన్ని చేయడానికి ముందుగా నేలపై రెండు కాళ్లు మడతపెట్టుకుని సౌకర్యంగా కూర్చోవాలి. తరువాత రెండు చేతుల వేళ్లను రెండు మోకాళ్లపై ఉంచాలి. ఆ తర్వాత లోతైన శ్వాస తీసుకుంటూ గాలిని నెమ్మదిగా పీల్చుకోవాలి. చేతులను మోకాళ్లపై స్వల్పంగా నొక్కుతూ మెడను పైకెత్తి ఆకాశం వైపు చూడాలి. కొద్దిసేపు ఈ స్థితిలో ఉండి మళ్లీ సాధారణ స్థితికి రావాలి. ఇలా రోజుకు కనీసం పది సార్లు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ సాధారణంగా కనిపించే వ్యాయామం వల్ల మెడ ప్రాంతంలో రక్తప్రసరణ మెరుగుపడుతుంది. దీని వల్ల మెడ నొప్పి, ఒత్తిడి తగ్గేందుకు సహాయపడుతుంది. అలాగే వెన్నెముక పైభాగానికి కూడా ఉపశమనం కలిగి మెదడుకు సరైన రక్తప్రసరణ అందుతుంది. ఫలితంగా శరీరం సేదతీరిన భావన కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. వ్యాయామం చేస్తున్న సమయంలో లోతైన శ్వాస తీసుకోవడం వల్ల ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది. శరీరంలో ఆక్సిజన్ సరఫరా పెరిగి శరీరానికి శక్తి అందుతుంది. ఇదే సమయంలో మెడను పైకెత్తి కొద్దిసేపు ఉంచడం వల్ల మెదడుకు రక్త సరఫరా మెరుగుపడి ఒత్తిడి తగ్గుతుంది. ఫలితంగా మానసిక ప్రశాంతత పెరిగి మంచి నిద్రకు కూడా సహాయపడుతుంది. ఇలాంటి సులభమైన యోగా వ్యాయామాలను క్రమం తప్పకుండా చేయడం వల్ల శరీర భంగిమ మెరుగుపడటంతో పాటు వెన్నెముక ఆరోగ్యం కూడా కాపాడబడుతుంది. రోజువారీ జీవనశైలిలో కొద్దిసేపు సమయం కేటాయించి ఈ విధమైన వ్యాయామాలను చేయడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

## కిడ్నీల ఆరోగ్యంపై
# జాగ్రత్త అవసరం



మన గళం, ఆరోగ్యం : మన శరీరంలో జరిగే జీవక్రియల వల్ల అనేక రకాల వ్యర్థాలు ఏర్పడతాయి. శరీరంలోని వివిధ అవయవాల నుంచి వచ్చిన ఈ వ్యర్థాలు రక్తంలోకి చేరుతాయి. ఈ మలినాలను వేరు చేసి రక్తాన్ని శుద్ధి చేసే కీలక బాధ్యతను మూత్రపిండాలు నిర్వహిస్తాయి. రక్తాన్ని శుద్ధి చేయడమే కాకుండా రక్తపోటును కూడా నియంత్రించడంలో కిడ్నీలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. రక్తపోటు మరియు రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో లేకపోతే మూత్రపిండాల పనితీరు దెబ్బతినే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కిడ్నీలు సరిగా పనిచేయకపోతే రక్తం శుద్ధి ప్రక్రియ తగ్గిపోతుంది. సమస్య తీవ్రమైతే ప్రాణాపాయం కూడా కలగవచ్చు. మన దేశంలో సుమారు 17 శాతం మందికి కిడ్నీ సంబంధిత వ్యాధులు ఉన్నట్లు పరిశోధనలు వెల్లడించాయి. బీపీ, షుగర్, క్యాన్సర్, హెచ్‌ఐవీ, క్షయవ్యాధి, కాలేయ వ్యాధులు, గుండె జబ్బులు, థైరాయిడ్, ఆర్థరైటిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి కిడ్నీ సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఈ రోగాల కోసం దీర్ఘకాలం మందులు వాడాల్సి రావడం వల్ల వాటి దుష్ప్రభావం మూత్రపిండాలపై పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రత్యేకంగా నొప్పి నివారణ మందులు మరియు యాంటీబయాటిక్స్‌ను తరచుగా తీసుకోవడం కిడ్నీలకు హానికరం కావచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అందువల్ల దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారు సంవత్సరానికి కనీసం ఒకసారి కిడ్నీ పనితీరు పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యలను ముందుగానే గుర్తించి జాగ్రత్తలు తీసుకోవచ్చని సూచిస్తున్నారు.

## ఉదయం లేవగానే
# తల తిరుగుతోందా..?





మన గళం, ఆరోగ్యం : చాలా మందికి ఉదయం నిద్రలేవగానే మంచం మీద నుంచి లేవడానికి ప్రయత్నించినప్పుడు ఒక్కసారిగా తల తిరిగినట్లు, కళ్లు మసకబారినట్లు అనిపిస్తుంది. కొద్దిసేపటి తర్వాత ఈ సమస్య తగ్గిపోవడంతో చాలామంది దానిని సాధారణ బలహీనతగా తీసుకుంటారు. అయితే ఇలా తరచూ జరుగుతుంటే అది శరీరం ఇస్తున్న హెచ్చరిక సంకేతం కావచ్చని వైద్యులు చెబుతున్నారు. మనం పడుకున్నప్పుడు రక్తప్రసరణ ఒక విధంగా ఉంటుంది. అకస్మాత్తుగా లేచి నిలబడినప్పుడు గురుత్వాకర్షణ ప్రభావం వల్ల రక్తం కాళ్ల వైపు మళ్లుతుంది. దీనివల్ల మెదడుకు రక్తప్రసరణ కొద్దిసేపు తగ్గి తల తిరుగుతుంది. వైద్య పరిభాషలో దీనిని ఆర్థోస్టాటిక్ హైపోటెన్షన్ అంటారు. కొద్దిసేపటి తర్వాత శరీరం మళ్లీ సర్దుబాటు అవడంతో సమస్య తగ్గిపోతుంది.

రాత్రంతా నీరు తాగకుండా నిద్రపోవడం వల్ల ఉదయం కల్లా శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుంది. పగటిపూట కూడా తక్కువ నీరు తాగే అలవాటు ఉంటే ఈ సమస్య మరింత ఎక్కువ అవుతుంది. అదేవిధంగా శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిలు తక్కువగా ఉన్నప్పుడు మెదడుకు అవసరమైన ఆక్సిజన్ సరఫరా తగ్గి తల తిరగడం, అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ సమస్య ముఖ్యంగా మహిళలు, వృద్ధులలో ఎక్కువగా కనిపిస్తుంది. రాత్రి భోజనం తక్కువగా చేయడం లేదా మధుమేహ మందులు వాడే వారికి ఉదయం రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గిపోవడం వల్ల కూడా తల తిరగడం జరుగుతుంది. అలాగే విటమిన్ బి12 లోపం, లోపలి చెవిలో సమస్యలు, అధిక ఒత్తిడి, నిద్రలేమి వంటి కారణాలు కూడా శరీర సమతుల్యతను దెబ్బతీసి తల తిరుగుదలకు దారితీస్తాయి. ఈ సమస్యను నివారించడానికి నిద్రలేవగానే ఒక్కసారిగా మంచం నుంచి దిగకుండా ముందుగా నెమ్మదిగా కూర్చోవాలి. కొద్దిసేపటి తర్వాతే నిలబడటం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయం లేవగానే ఒక గ్లాసు నీరు తాగే అలవాటు చేసుకోవాలి. ఐరన్, విటమిన్లు పుష్కలంగా ఉన్న పౌష్టికాహారం తీసుకోవడం కూడా అవసరం. అయితే తల తిరగడంతో పాటు తీవ్రమైన తలనొప్పి, వాంతులు, ఛాతీ నొప్పి, మాట్లాడటంలో ఇబ్బంది లేదా చేతులు, కాళ్లు తిమ్మిర్లు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# నయన్ క్రేజ్ ఏమాత్రం తగ్గట్లేదు




మన గళం : ఇండస్ట్రీకి ఎంతమంది కుర్ర భామలు క్యూ కడుతున్నా.. లేడీ సూపర్ స్టార్ నయనతార రేంజ్ మాత్రం ఎవరికీ అందనంత ఎత్తులోనే ఉంది. తోటి హీరోయిన్స్ అంతా రేసులో వెనుకబడుతున్నా సరే.. నయన్ క్రేజ్ ఏమాత్రం తగ్గట్లేదు సరికదా.. ఇంకా పెరుగుతుంది. చేతినిండా సినిమాలతో ఇండస్ట్రీని ఏలుతున్న ఈ బ్యూటీ లైనప్ చూస్తే మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే.. ఆ ముచ్చట్లేంటో చూద్దామా..? ఇండస్ట్రీలోకి ఎంతమంది కొత్త కుర్ర హీరోయిన్లు వస్తున్నా.. నయనతార స్పీడ్‌ను, ఆమెకున్న స్టార్‌డమ్‌ను కనీసం మ్యాచ్ చేయలేకపోతున్నారు. ఒకప్పుడు ఆమెతో పాటే కెరీర్ స్టార్ట్ చేసి సక్సెస్ చూసిన సమంత, తమన్నా, కాజల్, అనుష్క లాంటి సీనియర్లు నెమ్మదించినా.. నయనతార మాత్రం అస్సలు తగ్గేదే లే అంటూ జెట్ స్పీడ్‌తో దూసుకుపోతున్నారు. మన శంకరవరప్రసాద్ గారులో నటించి సాలిడ్ బ్లాక్ బస్టర్ ఖాతాలో వేసుకున్న లేడీ సూపర్ స్టార్.. జూన్ 4న పాన్ ఇండియా మూవీ టాక్సిక్‌తో రాబోతున్నారు. దీనికి తోడు బాలకృష్ణ కొత్త సినిమా 111లోనూ హీరోయిన్‌గా ఈ భామనే ఫైనల్ చేసినట్లు తెలుస్తుంది. గతంలో సింహా, జై సింహా, శ్రీ రామరాజ్యం లాంటి సినిమాలు చేసారు బాలయ్య, నయనతార. ఓవైపు హీరోయిన్‌గా నటిస్తూనే.. మరోవైపు మూకుతి అమ్మన్ 2, రెక్కయి లాంటి లేడీ ఓరియెంటెడ్ సినిమాలు కూడా చేస్తున్నారు నయనతార. వరుస ప్రాజెక్టులు ఉండటంతో.. డిమాండ్‌కు తగ్గట్లే ఒక్కో సినిమాకు ఏకంగా 10 కోట్ల వరకు రెమ్యునరేషన్ తీసుకుంటున్నారు. సౌత్ ఇండస్ట్రీలో నయన్‌ను బీట్ చేసే హీరోయిన్ ఇప్పట్లో వచ్చేలా కనిపించట్లేదు.

# 'ఉస్తాద్ భగత్ సింగ్'లో ఐటమ్ సాంగ్ లేదు..




మన గళం : పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా దర్శకుడు హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ "ఉస్తాద్ భగత్ సింగ్" పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన "గబ్బర్ సింగ్" చిత్రం బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా ఆ సినిమాలోని "కెవ్వు కేక" పాట అప్పట్లో ఎంత పెద్ద హిట్ అయ్యిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.అయితే ఈసారి అదే తరహాలో స్పెషల్ సాంగ్ ఉండబోదని దర్శకుడు హరీశ్ శంకర్ తాజాగా స్పష్టం చేశారు. ఈ నిర్ణయం వెనుక ఉన్న కారణాన్ని కూడా ఆయన వివరించారు. ప్రస్తుతం పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రిగా కీలక రాజకీయ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని, ఆ హోదాకు తగిన గౌరవాన్ని కాపాడుతూ సినిమాను రూపొందిస్తున్నామని తెలిపారు. ఒక డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న వ్యక్తి ఐటమ్ గర్ల్ వెనుక తిరుగుతూ పాటలు పాడితే ప్రేక్షకులకు సరైన సందేశం ఇవ్వదు. అందుకే ఈ సినిమాలో ఆ తరహా ప్రత్యేక గీతాన్ని చేర్చలేదు" అని హరీశ్ శంకర్ వెల్లడించారు. పవన్ కల్యాణ్ ఇమేజ్, ఆయన ప్రస్తుత రాజకీయ స్థాయిని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.ఇక ఈ సినిమాలో పవన్ కల్యాణ్ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతుందని తెలుస్తోంది. యాక్షన్‌తో పాటు సామాజిక సందేశం కూడా ఉండేలా కథను రూపొందించినట్లు సమాచారం. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ అభిమానుల్లో సినిమాపై మరింత ఆసక్తిని పెంచాయి. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు. సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ అందించిన పాటలు ఇప్పటికే మంచి స్పందన పొందాయి. త్వరలోనే మూడవ సింగిల్‌ను విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. అలాగే ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ ఈ సినిమాకు నేపథ్య సంగీతాన్ని అందిస్తున్నట్లు సమాచారం. యాక్షన్ సన్నివేశాలకు తగ్గట్టుగా పవర్‌ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఇవ్వాలని మేకర్స్ ప్రత్యేకంగా ప్లాన్ చేస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న "ఉస్తాద్ భగత్ సింగ్" సినిమాను మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. పవన్ కల్యాణ్ హరీశ్ శంకర్ కాంబినేషన్ మరోసారి బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తుందా అనే ఆసక్తి ఇప్పుడు అభిమానుల్లో నెలకొంది



# వారణాసి మూవీ అప్‌డేట్స్.. మంచు కొండల్లో మహేష్ విన్యాసాలు

మన గళం :యుద్ధాలు జరిగినా.. పిడుగులు పడినా.. తమ పని తాము చేస్తున్నారు వారణాసి టీం. ఈ సినిమా అప్‌డేట్స్ చూసి పండగ చేసుకుంటున్నారు ఫ్యాన్స్. అంచనాలకు మించి షూటింగ్ రాకెట్ స్పీడ్‌తో దూసుకుపోతుండగా.. దీని ఓవర్సీస్ బిజినెస్ కూడా ఇండియన్ సినిమాలోనే రికార్డులు బద్దలు కొడుతోంది. అసలు షూట్ ఎక్కడ జరుగుతుంది.. గడ్డకట్టే మంచులో ఏం చేస్తున్నారు..? రాజమౌళి తెరకెక్కిస్తున్న వారణాసి షూటింగ్ అనుకున్న దానికంటే చాలా ఫాస్ట్‌గా కంప్లీట్ అవుతోంది. ప్రస్తుతం ఈ చిత్ర యూనిట్ అంటార్కిటికాలోని గడ్డకట్టే మంచు కొండల్లో అత్యంత కఠినమైన వాతావరణంలో శరవేగంగా కొత్త షెడ్యూల్‌ను పూర్తి చేస్తున్నారు. మహేష్ అయితే ఈ సినిమా కోసం ఒక్కముక్కలో చెప్పాలంటే ప్రాణం పెట్టేస్తున్నారు. అంటార్కిటికా షెడ్యూల్‌లో మహేష్ బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ మధ్య ఒక మైండ్ బ్లోయింగ్ యాక్షన్ సీక్వెన్స్‌ను రాజమౌళి భారీ స్థాయిలో ప్లాన్ చేశారు. హాలీవుడ్ రేంజ్‌లో డిజైన్ చేసిన ఈ ఫైట్ సీన్ కోసం ఇద్దరు స్టార్స్ పోటీపడి మరీ నటిస్తున్నారు. ప్రియాంక చోప్రా ఈ మధ్యే అంటార్కిటికా షెడ్యూల్‌పై అప్‌డేట్ లీక్ చేసారు. అక్కడ చిత్రీకరిస్తున్న తొలి ఇండియన్ సినిమా ఇదే. వారణాసి సినిమాకు అంటార్కిటికా షెడ్యూల్ మేజర్ హైలైట్ కాబోతుందని తెలుస్తుంది. అక్కడ చిత్రీకరిస్తున్న యాక్షన్ సీక్వెన్సులు ఇండియన్ స్క్రీన్ మీద నెవర్ బిఫోర్ అన్నట్లుగా ఉండేలా ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. ఈ ఒక్క సీక్వెన్స్ కోసం జక్కన్న టీమ్ రేయింబవళ్లు ఎంతో శ్రమిస్తూ.. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఓ విజువల్ వండర్‌గా దీన్ని చెక్కుతున్నారు. ఈ సినిమా మార్కెట్ గురించి ఏం చెప్పాలి..? ఓవర్సీస్‌లో మరే ఇండియన్ సినిమాకు అందనంత ఎత్తులో.. కళ్లు చెదిరే ధరకు వారణాసి రైట్స్ అడుగుతున్నారు. కానీ రాజమౌళి మాత్రం ఏం చెప్పట్లేదు. విడుదలకు ముందే ఈ రేంజ్ రికార్డులు సెట్ చేస్తుందంటే.. థియేటర్లలో ఆ వండర్స్ మన ఊహకే వదిలేయాలేమో..? ఏప్రిల్ 7, 2027న విడుదల కానుంది ఈ చిత్రం.




# ప్రభాస్ 'స్పిరిట్'పై కొత్త చర్చలు

మన గళం : పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న భారీ ప్రాజెక్టలలో ప్రేక్షకులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం "స్పిరిట్". దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న ఈ సినిమా ఒక పవర్‌ఫుల్ పోలీస్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. ప్రాజెక్ట్ ప్రకటించినప్పటి నుంచే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ వేగంగా కొనసాగుతుండగా, తాజా షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ఈ యాక్షన్ భాగం పూర్తయిన తర్వాత చిత్రబృందం ఒక గ్రాండ్ పాటను చిత్రీకరించేందుకు సిద్ధమవుతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ పాట సినిమాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇందులో ప్రభాస్ మాస్ స్టెప్స్‌తో పాటు హీరోయిన్ తృప్తి దిమ్రి గ్లామర్ కూడా ప్రధాన హైలైట్‌గా ఉండబోతుందని సమాచారం. భారీ సెట్స్, అద్భుతమైన దృశ్యాలతో ఈ పాటను చిత్రీకరించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం సినిమా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతుండగా, ఇందులో ప్రభాస్ ఒక శక్తివంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నాడు. ఇప్పటికే విడుదలైన పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించింది. ప్రభాస్ కొత్త లుక్ మరింత మాస్‌గా, వైల్డ్ స్టైల్‌లో ఉండటంతో అభిమానుల్లో ఈ సినిమాపై హైప్ పెరిగింది. ఈ చిత్రానికి సంగీతాన్ని హర్షవర్ధన్ రామేశ్వర్ అందిస్తున్నారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఇప్పటికే మ్యూజిక్ సిట్టింగ్స్ పూర్తి చేసినట్లు సమాచారం. కథలోని భావోద్వేగాలు, యాక్షన్‌కు తగ్గట్టుగా ప్రత్యేకమైన నేపథ్య సంగీతాన్ని సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని టి సిరీస్‌తో పాటు భద్రకాళి పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. కథ కూడా పూర్తిగా కొత్త కాన్సెప్ట్‌తో ఉండబోతుందని, దర్శకుడు తన ప్రత్యేక శైలిలో యాక్షన్‌తో పాటు గట్టి భావోద్వేగాలను కూడా సినిమాలో చూపించనున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక



# ఐపీఎల్ 2026 షెడ్యూల్‌పై కీలక అప్‌డేట్




న్యూఢిల్లీ, మార్చి 10, మన గళం : భారత క్రికెట్ నియంత్రణ మండలి ఈ ఏడాది జరగనున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ షెడ్యూల్‌పై కీలక ప్రకటన చేసింది. ఈ నెల 12వ తేదీలోగా టోర్నమెంట్ తొలి ఇరవై రోజుల షెడ్యూల్‌ను విడుదల చేయనున్నట్లు మండలి కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ ఈ నెల 28 నుంచి ప్రారంభమై మే 31 వరకు కొనసాగనుంది. మొత్తం షెడ్యూల్‌ను ఒకేసారి ప్రకటించకపోవడానికి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలే ప్రధాన కారణమని తెలుస్తోంది. పశ్చిమ బెంగాల్, అసోం, తమిళనాడు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మ్యాచ్‌ల తేదీలు, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని మండలి ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం తొలి ఇరవై రోజుల షెడ్యూల్‌ను మాత్రమే ప్రకటించి, ఎన్నికల తేదీలు ఖరారైన తర్వాత మిగతా మ్యాచ్‌ల వివరాలను వెల్లడించనున్నట్లు మండలి తెలిపింది.

ఇక ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న టోర్నమెంట్ కోసం ఫ్రాంచైజీలు ఇప్పటికే తమ సన్నాహాలను వేగవంతం చేశాయి. ఐదుసార్లు విజేతగా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తమ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, సీనియర్ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచే నవలూర్‌లోని హై పెర్ఫార్మెన్స్ కేంద్రంలో సాధన ప్రారంభించింది. గత సీజన్ విజేత రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు కూడా నవీ ముంబైలో ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని నిర్వహించింది.

వీరితో పాటు గుజరాత్ టైటాన్స్, పంజాబ్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబై ఇండియన్స్ జట్లు కూడా తమ ఆటగాళ్లతో సాధన శిబిరాలను కొనసాగిస్తున్నాయి. రాజస్థాన్ రాయల్స్ ఈ నెల 15 నుంచి జైపూర్‌లో శిబిరాన్ని ప్రారంభించనుండగా, కోల్‌కతా నైట్ రైడర్స్ 18 నుంచి తమ శిక్షణ కార్యక్రమాన్ని మొదలుపెట్టనుంది. ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లు ఇప్పటికే తమ సన్నాహక శిబిరాలను పూర్తి చేశాయి.

## టీమిండియా కెప్టెన్‌గా సంజూ శాంసన్? కైఫ్ సూచన




న్యూఢిల్లీ, మార్చి 10, , మన గళం :ఐసీసీ పురుషుల టీ ఇరవై ప్రపంచకప్ రెండువేల ఇరవై ఆరు టోర్నీలో భారత జట్టు విజయంలో సంజూ శాంసన్ కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో అతడికి నాయకత్వ బాధ్యతలు ఇవ్వాలనే సూచనలు వినిపిస్తున్నాయి. ఈ టోర్నీలో నిలకడైన ప్రదర్శనతో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నిలిచిన శాంసన్ ప్రతిష్టాత్మక "ప్లేయర్ ఆఫ్ ద సిరీస్" అవార్డును కూడా అందుకున్నాడు. అతని అద్భుత బ్యాటింగ్‌తో భారత్ టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించడంతో ప్రస్తుతం క్రికెట్ ప్రపంచంలో శాంసన్ పేరు విస్తృతంగా చర్చకు వస్తోంది.

ఈ నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్ మొహమ్మద్ కైఫ్ సంజూ శాంసన్‌ను భవిష్యత్తులో భారత జట్టు కెప్టెన్‌గా పరిగణించాలని సూచించాడు. టోర్నమెంట్ మొత్తం పాటు శాంసన్ చూపిన స్థిరమైన ఆటతీరు, ఒత్తిడిని ఎదుర్కొనే ధైర్యం, జట్టును ముందుండి నడిపించే సామర్థ్యం అతనిలో ఉన్నాయని కైఫ్ అభిప్రాయపడ్డాడు. టీ ఇరవై ప్రపంచకప్‌లో శాంసన్ కీలక మ్యాచ్‌ల్లో పరుగులు చేసి జట్టుకు విజయాలను అందించాడు. అతని దూకుడైన బ్యాటింగ్‌తో పాటు పరిస్థితిని బట్టి ఆడగల సామర్థ్యం జట్టుకు పెద్ద బలంగా నిలిచింది. ఈ కారణంగానే అతడిని నాయకత్వ బాధ్యతలకు పరిగణించాలని క్రికెట్ విశ్లేషకులు కూడా భావిస్తున్నారు. అయితే భారత జట్టు నాయకత్వంపై తుది నిర్ణయం భారత క్రికెట్ నియంత్రణ మండలి తీసుకోనుంది. ప్రస్తుతం జట్టు భవిష్యత్ ప్రణాళికలను దృష్టిలో ఉంచుకుని యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పించాలనే ఆలోచన కూడా బోర్డులో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సంజూ శాంసన్‌కు భవిష్యత్తులో మరింత కీలక బాధ్యతలు వచ్చే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ఐసీసీ టైటిళ్లు గెలిచిన ఐదు భారత జట్లకు బీసీసీఐ సన్మానం



న్యూఢిల్లీ, మార్చి 10, మన గళం: భారత క్రికెట్ నియంత్రణ మండలి అయిన తన వార్షిక అవార్డుల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. 'నమన్' పేరుతో జరగనున్న ఈ వేడుకను మార్చి 15న న్యూఢిల్లీలో నిర్వహించనున్నట్లు బీసీసీఐ కార్యదర్శి తెలిపారు. గత ఏడాది కాలంలో అంతర్జాతీయ క్రికెట్ మండలి టోర్నీల్లో విజేతలుగా నిలిచిన ఐదు భారత జట్లను ఈ కార్యక్రమంలో ఘనంగా సత్కరించనున్నారు. ఈ అవార్డుల వేడుకకు ఇటీవల టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుతో పాటు 2025 ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన జట్టును కూడా ఆహ్వానిస్తున్నట్లు బీసీసీఐ తెలిపింది. సీనియర్ పురుషుల జట్టుతో పాటు సీనియర్ మహిళల జట్టు, అండర్-19 బాలుర జట్టు, అండర్-19 బాలికల జట్టు సభ్యులందరినీ ఈ వేడుకలో గౌరవించనున్నారు. గత ఏడాదిలో ఐసీసీ ట్రోఫీలు గెలిచిన భారత జట్లకు ఇది ప్రత్యేక సన్మానంగా ఉండనుంది. అదే సమయంలో 2024-25 సీజన్‌లో దేశవాళీ, అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఆటగాళ్లకు కూడా అవార్డులు అందజేయనున్నారు. ఇక మార్చి 28 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆటగాళ్లు తమ ఫ్రాంచైజీ శిబిరాలకు సులభంగా చేరుకునేలా ఢిల్లీ విమానాశ్రయానికి సమీపంలోని ఐదు నక్షత్రాల హోటల్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అదే సమయంలో 2026 పురుషుల టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుకు బీసీసీఐ భారీ నగదు బహుమతిని ప్రకటించింది. మొత్తం రూ.131 కోట్ల నజరానాను ప్రకటించగా, ఈ మొత్తాన్ని ఆటగాళ్లతో పాటు సహాయక సిబ్బంది, ఎంపిక కమిటీ సభ్యులతో పంచనున్నట్లు బీసీసీఐ తెలిపింది. భారత జట్టుకు ఇంత భారీ నగదు బహుమతి ప్రకటించడం ఇదే మొదటిసారి అని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి.


## క్షమాపణతో సరిపోలేదు.. భారత పేసర్‌కు జరిమానా



అహ్మదాబాద్, మార్చి 10,మన గళం: పొట్టి ప్రపంచకప్ విజయం ఆనందాన్ని ఆస్వాదిస్తున్న భారత జట్టు పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌కు అంతర్జాతీయ క్రికెట్ మండలి జరిమానా విధించింది. న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మైదానంలో అనుచిత ప్రవర్తనకు పాల్పడినందుకు అతనిపై ఈ చర్య తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మ్యాచ్ సందర్భంగా న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ వైపు బంతిని వేగంగా విసరడంతో ఐసీసీ నియమావళిని ఉల్లంఘించినట్లు నిర్ణయించారు. ఈ కారణంగా అర్ష్‌దీప్ సింగ్ మ్యాచ్ ఫీజులో పదిహేను శాతం జరిమానా విధించబడింది.

మార్చి 8న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో భారత్ న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. భారత్ నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేధించేందుకు ప్రయత్నిస్తున్న న్యూజిలాండ్ జట్టు తరఫున మిచెల్ సాంట్నర్, డారిల్ మిచెల్ క్రీజులో నిలబడి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో బౌలింగ్ చేస్తున్న అర్ష్‌దీప్ సింగ్ ఓవర్లో మిచెల్ రెండు భారీ సిక్సర్లు కొట్టాడు. దీంతో అసహనానికి గురైన అర్ష్‌దీప్ తర్వాతి బంతిని బ్యాటర్ వైపు వేగంగా విసిరాడు. ఆ బంతి నేరుగా మిచెల్‌కు తాకడంతో మైదానంలో కొంత ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనపై మిచెల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా భారత జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మధ్యవర్తిత్వం చేసి పరిస్థితిని సర్దిచెప్పాడు. అంపైర్ కూడా భారత బౌలర్ ప్రవర్తనను తప్పుపట్టి హెచ్చరించాడు. ఆ ఓవర్ ముగిసే సరికి ఇద్దరూ చేతులు కలుపుకోవడంతో పరిస్థితి సద్దుమణిగింది. మ్యాచ్ అనంతరం అర్ష్‌దీప్ సింగ్ మిచెల్‌కు క్షమాపణలు చెప్పినట్లు వెల్లడించాడు.

# కీర్తి ఆజాద్ వ్యాఖ్యలపై ఇషాన్ కిషన్ ఘాటు స్పందన



పాట్నా, మార్చి 10, మన గళం: పొట్టి ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శనతో మెరిసిన భారత వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ మాజీ క్రికెటర్ కీర్తి ఆజాద్ చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించాడు. న్యూజిలాండ్‌పై జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మెరుపు అర్ధశతకంతో జట్టు విజయానికి కీలక పాత్ర పోషించిన ఇషాన్ కిషన్ సోమవారం పాట్నా విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడాడు. ఈ సందర్భంగా కీర్తి ఆజాద్ చేసిన విమర్శలపై స్పందించాలని మీడియా ప్రశ్నించగా ఆయన తెలివైన కౌంటర్ ఇచ్చాడు. మార్చి 8న జరిగిన ఫైనల్‌లో న్యూజిలాండ్ జట్టును 96 పరుగుల తేడాతో ఓడించిన భారత్ మూడోసారి పొట్టి ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. విజయం అనంతరం భారత ఆటగాళ్లు ట్రోఫీని తీసుకుని దేవాలయానికి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అయితే ట్రోఫీని ఆలయంలోకి తీసుకెళ్లడంపై మాజీ క్రికెటర్, ప్రస్తుతం పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న కీర్తి ఆజాద్ విమర్శలు చేశారు. ప్రపంచకప్ ట్రోఫీతో ఆలయానికి వెళ్లిన భారత ఆటగాళ్లు సిగ్గుపడాలని ఆయన వ్యాఖ్యానించారు.

ఈ వ్యాఖ్యలపై స్పందించమని మీడియా అడగగా ఇషాన్ కిషన్ ఒక్కసారిగా ప్రతిస్పందించాడు. కీర్తి ఆజాద్ వ్యాఖ్యలపై తాను ఏమి మాట్లాడాలో అర్థం కావడం లేదని, తమ జట్టు ప్రపంచకప్ గెలిచిన సమయంలో ఇలాంటి ప్రశ్నలు కాకుండా మంచి ప్రశ్నలు అడగాలని ఆశిస్తున్నానని అన్నాడు. అంతేకాకుండా కీర్తి ఆజాద్ ఎవరో తనకు తెలియదని, ఆయన వ్యాఖ్యలను ఎవరు పట్టించుకుంటారని ప్రశ్నిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశాడు. ఇక ఈ వివాదంపై భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ కూడా స్పందించాడు. ప్రపంచకప్ ట్రోఫీని దేవాలయానికి తీసుకెళ్లడాన్ని రాజకీయంగా చూపడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డాడు. కీర్తి ఆజాద్ ఒక మాజీ క్రికెటర్ అయినప్పటికీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆశ్చర్యకరమని, బహుశా రాజకీయాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం వల్ల తన క్రికెట్ గతాన్ని ఆయన మర్చిపోయి ఉండవచ్చని పేర్కొన్నారు. కీర్తి ఆజాద్ 1983లో కపిల్ దేవ్ నాయకత్వంలోని భారత జట్టు వన్డే ప్రపంచకప్ గెలిచినప్పుడు ఆ జట్టులో సభ్యుడిగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన పశ్చిమ బెంగాల్‌లోని బర్ధమాన్‌దుర్గాపూర్ నియోజకవర్గం నుంచి పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగుతున్నారు.

# గుజరాత్ జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా మాథ్యూ హేడెన్



అహ్మదాబాద్, మార్చి 10, మన గళం: ఇండియన్ ప్రీమియర్ లీగ్ పంతొమ్మిదో సీజన్‌కు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో గుజరాత్ టైటాన్స్ జట్టు కీలక నిర్ణయం తీసుకుంది. గత సీజన్‌లో ఎదురైన నిరాశను దృష్టిలో పెట్టుకుని ఆస్ట్రేలియా మాజీ దిగ్గజ బ్యాటర్ మాథ్యూ హేడెన్‌ను బ్యాటింగ్ కోచ్‌గా నియమించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో ఒకప్పుడు విధ్వంసక ఓపెనర్‌గా గుర్తింపు పొందిన హేడెన్ అనుభవం జట్టు బ్యాటింగ్ విభాగాన్ని బలోపేతం చేయడంలో ఉపయోగపడుతుందని యాజమాన్యం భావిస్తోంది. మార్చి 28 నుంచి ప్రారంభం కానున్న ఈ సీజన్‌కు ముందు ఫ్రాంచైజీలు తమ జట్లను మరింత పటిష్టం చేసే ప్రయత్నాల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో గుజరాత్ టైటాన్స్ బ్యాటింగ్ విభాగాన్ని మెరుగుపరచేందుకు హేడెన్‌ను కోచ్‌గా నియమించినట్లు జట్టు డైరెక్టర్ విక్రమ్ సోలంకీ వెల్లడించారు. జట్టు దీర్ఘకాలిక విజయాలను లక్ష్యంగా పెట్టుకుని ప్రతిభావంతులైన వ్యక్తులను జట్టులోకి తీసుకురావడంపై దృష్టి సారిస్తున్నామని ఆయన తెలిపారు. తనను బ్యాటింగ్ కోచ్‌గా నియమించడంపై మాథ్యూ హేడెన్ కూడా సంతోషం వ్యక్తం చేశాడు. మంచి బ్యాటింగ్ ప్రదర్శన ఇవ్వాలంటే ఒత్తిడిని తట్టుకోవడం అవసరమని, అత్యుత్తమ ఆటతో మ్యాచ్‌ను ప్రభావితం చేయగల సామర్థ్యాన్ని ఆటగాళ్లలో పెంపొందించాలనే లక్ష్యంతో పని చేస్తానని ఆయన పేర్కొన్నారు. మాథ్యూ హేడెన్ ఆస్ట్రేలియా జట్టు తరఫున అత్యుత్తమ ఓపెనర్‌గా పేరు సంపాదించాడు.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP. Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.